ప్రజాశక్తి
సోమవారం 9 జనవరి 2023 5 విజయనగరం



## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

అభ్యుదయ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రక్తం కొరతను నివారించేందుకు అభ్యుదయ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. శిబిరంలో 202 మంది యువతీ యువకులు హాజరై రక్తదానం చేశారు. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని అభ్యుదయ పాఠశాల కరస్పాండెంట్ నాని, ప్రిన్సిపల్ చింతా శారద అన్నారు. బొబ్బిలి రక్తనిధి, విశాఖ ఎన్‌టిఆర్ రక్తనిధి, విజయనగరం ఎన్‌విఆర్ రక్తనిధి సిబ్బంది రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో బొబ్బిలి రక్తనిధి వైద్యాధికారి అక్కేన దివాకర్ బాబు, నాగేశ్వరరావు, సాయి పాల్గొన్నారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

# గిరిజన మంత్రి అంటే.. అంత అలుసా?

- డిప్యూటీ సిఎంను పట్టించుకోని అధికారులు
- నూతన సంవత్సర శుభాకాంక్షలు కూడా తెలపని మన్యం బాస్‌లు
- విస్మయం వ్యక్తం చేస్తున్న వైసిపి శ్రేణులు

**వైసిపి అధికారంలోకి వచ్చి మూడున్నర ఏళ్లయింది. డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా రాజన్నదొర పదవీ బాధ్యతలు చేపట్టి అర్ధ సంవత్సరం దాటిపోయింది. ఆయన డిప్యూటీ సిఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి కొత్త సంవత్సరం వచ్చింది. సాధారణంగా మంత్రి స్థానంలో ఎవరున్నా సంబంధిత జిల్లా, ఇరుగుపొరుగు జిల్లాల అధికారులు నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు చెప్పడానికి వస్తారు. రాజన్నదొర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి. అంటే రాష్ట్రంలోని ఏడు ఐటిడిఎలకు ఆయనే సుప్రీం. ఐటిడిఎల ద్వారా ఏ ఫైలు కదలాలన్నా సంబంధిత మంత్రి కనుసన్నల్లోనే కదులుతుంది. అయితే వారం రోజుల క్రితం డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసంలో కొత్త సంవత్సరం వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మన్యం జిల్లాకు చెందిన బాసులెవరూ మంత్రి రాజన్నదొరకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి రాకపోవడం చర్చనీయాంశమైంది.**

ప్రజాశక్తి- సాలూరు

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పట్టణంలోని డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసానికి గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఏడు ఐటిడిఎ ప్రాజెక్టులకు సంబంధించిన పిఒలు, డిడిలు, ఎటిడబ్ల్యుఒలు హాజరవుతారని పార్టీ నాయకులు కార్యకర్తలు భావించారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పిలతో మన్యం జిల్లా అధికార యంత్రాంగమంతా కొత్త సంవత్సరం శుభాకాంక్షలు చెప్పడానికి వస్తారని భావించారు. కానీ మన్యం జిల్లాకు సంబంధించిన కలెక్టర్, ఎస్‌పిలే కాకుండా ఏ ఒక్క ఐటిడిఎ పిఒ కూడా హాజరు కాకపోవడం పార్టీ శ్రేణుల్లో చర్చకు తెరలేపింది. గిరిజన మంత్రి పట్ల అధికారులు ఇంత చులకనగా వ్యవహరిస్తారా? అన్న చర్చ సాగుతోంది. గతేడాది జనవరి ఫస్ట్‌కు డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి హోదాలో కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఉన్నారు. ఆమె పదవిలో సమయంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, ఉమ్మడి జిల్లా కలెక్టరూ ఆమె నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అటు మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు మరో మంత్రి పుష్పశ్రీవాణికి అదే స్థాయిలో శుభాకాంక్షలు చెప్పడానికి పరుగులు తీశారు. జిల్లా విభజన తర్వాత కనీసం మన్యం జిల్లా అధికారులైనా జిల్లా మంత్రి రాజన్నదొరకు శుభాకాంక్షలు చెప్పడానికి హాజరు కావాల్సి ఉంది. కానీ కీలకమైన అధికారులెవరూ మంత్రి రాజన్నదొర వైపు కనీసం కన్నెత్తి చూడలేదు. దీనికి ప్రధాన కారణం ఏమిటనే చర్చ మొదలైంది. రాష్ట్ర మంత్రి వర్గం లో సిఎం జగన్ మోహన్ రెడ్డి తర్వాత ఉన్న ముగ్గురు డిప్యూటీ సిఎంల్లో రాజన్న దొరే మొదటి ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు. మంత్రిగా ఆయన అధికారాలను అనుభవించకుండా పార్టీలో కొంతమంది కీలక నేతలు అడ్డు తగులుతున్నారనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

మంత్రి హోదాలో ఉన్న రాజన్నదొరకు కనీస ప్రోటోకాల్ మర్యాదలు కూడా పాటించకుండా పార్టీలో కీలక నాయకులు పని చేస్తున్నారేమోనని గుసగుసలాడుకుంటున్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఏనాడూ ఒక గిరిజన సంక్షేమశాఖ మంత్రికి జరగని విధంగా అవమానం ప్రస్తుతం రాజన్నదొరకు ఎదురవుతోందని ఆయన సన్నిహితులు మదనపడుతున్నారు. రాజన్నదొర జిల్లా అధికారుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం కూడా వారి వివక్షా పూరిత వైఖరికి కారణమై ఉండొచ్చునని తెలుస్తోంది. పార్వతీపురం ఐటిడిఎ పిఒగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సిహెచ్.విష్ణుచరణ్ ఇంతవరకు కనీసం మర్యాద పూర్వకంగానైనా సంబంధిత శాఖా మంత్రి రాజన్నదొరను కలవలేదనే చర్చ నడుస్తోంది. కనీసం నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి కూడా మన్యం జిల్లా పరిధిలో ఉన్న పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు కూడా హాజరు కాలేదు. తాజా పరిణామాలపై అధికార పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలలో విస్తృత చర్చ జరుగుతోంది.

## సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో..
# విద్యారంగ పరిరక్షణకు పోరాటం

### సావిత్రీబాయి జయంతి వేడుకల ముగింపు సభలో వక్తలు

ప్రజాశక్తి-బొబ్బిలి

సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో విద్యారంగ పరిరక్షణకు పోరాటం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్‌ఎస్‌ఎస్ డిగ్రీ కళాశాలలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు శారదారాణి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల ముగింపు సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ మాట్లాడుతూ విద్యారంగంలో అనేక మార్పులకు దోహదపడిన సావిత్రిబాయి పూలే సమాజంలో మార్పు కోసం కృషి చేశారని తెలిపారు. ఆమె ఆశయాలను ప్రస్తుత ఉపాధ్యాయులు కొనసాగించాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం అమలుకు పూనుకుని విద్యారంగాన్ని నేడు ఛిన్నాభిన్నం చేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. సావిత్రిబాయి విద్యలో అంతరాలు పోవాలని కృషి చేస్తే, నేటి పాలకులు అంతరాలను పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్‌ఇపి అమలుతో ఆడపిల్లలు చదువుకు దూరమవుతారని ఆందోళన చెందారు. మరింత డ్రాపవుట్లుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ విధానాలను అడ్డుకోవడమే సావిత్రిబాయికి నిజమైన నివాళులని పేర్కొన్నారు. అనంతరం యుటిఎఫ్ విజయనగరం, మన్యం జిల్లా నాయకులు ప్రసన్నకుమార్, రాజామణి, జ్యోతి, ఐద్వా జిల్లా అధ్యక్షులు పుణ్యవతి మాట్లాడారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బొబ్బిలి గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆ పాఠశాల ఉపాధ్యాయులు లావణ్య గైడ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కేశవరావు, నాయకులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

బొబ్బిలి.. సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ, యుటిఎఫ్, ఐద్వా నాయకులు

**విజయనగరం టౌన్ :** జెడ్‌పి మినిస్టీరియల్ హాల్లో సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాల ముగింపు సభను యుటిఎఫ్ జిల్లా మహిళా సబ్ కమిటీ కన్వీనర్ వి.రాధా భవాని అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో అందరికీ సమాన విద్య కోసం పాటుపడాలని కోరారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రమేష్‌చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు సత్య శ్రీనివాస్, కోశాధికారి సిహెచ్ భాస్కరరావు, జిల్లా కార్యదర్శి అల్లు శంకర్రావు, రాష్ట్ర కౌన్సిలర్ డి.రాము, కె.శ్రీదేవి, జిల్లా మహిళా కమిటీ కోకన్వీనర్లు మాధవి లత, పద్మ, రూపావతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్.. సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

## ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష

**72.6 శాతం హాజరు**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్ష కోసం జిల్లా కేంద్రంలోనే 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 5,530 మందికి 3994 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను డిఆర్‌ఒ గణపతిరావు పర్యవేక్షించారు. జెఎన్‌టియు, సీతం, శ్రీ చైతన్య, గాయత్రి విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలకు నోడల్ అధికారులుగా నియమించిన జిల్లా అధికారులు పర్యవేక్షణలో సాయంత్రం 4 గంటలతో పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు

## అందరి సహకారంతో వ్యాపారాభివృద్ధి

### డిసిఎంఎస్ చైర్‌పర్సన్ భావన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో డిసిఎంఎస్ ద్వారా రైతులకు, విద్యార్థులకు సేవలు అందించి, సంస్థ వ్యాపారాభివృద్ధికి కృషి చేస్తామని డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన తెలిపారు. ఆదివారం స్థానిక డిసిఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇంత వరకు సాధించిన ప్రగతిని ఆమె వివరించారు. డిసిఎంఎస్ గత ఏడాది రూ.19.50 కోట్లు వ్యాపారం చేస్తే , ఈ ఏడాది 6 నెలల్లో రూ.15 కోట్లు వ్యాపారం చేసినట్లు వివరించారు. టిటిడి, వేద పాఠశాలలకు, ఆశ్రమ, సంక్షేమ వసతిగృహాలకు వంట సరుకులు సరఫరా చేస్తున్నామన్నారు. విత్తనాలు 7 మెట్రిక్ టన్నులు, ఎరువులు నాణ్యమైనవి అందజేసినట్లు చెప్పారు. సేంద్రీయ సాగు పట్ల రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, రైతులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. వైసిపి సీనియర్ నాయకులు అవనాపు విక్రమ్ మాట్లాడుతూ మనందరం ఒకే కుటుంబంగా ఉండాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో మహిళలకు ఇంకా ప్రోత్సహించే విధంగా సిఎం జగన్ కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.

మాట్లాడుతున్న డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన

## 26 నుంచి పాదయాత్ర

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ నెల 26 నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన పాదయాత్ర చేపడుతున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పి.రాకేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26 నుంచి మార్చి 26 వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన అభివృద్ధి, భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలను వివరించాలని సూచించారు. పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ నగర అధ్యక్షులు సుంకరి సతీష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, నాయకులు డోలా శ్రీనివాస్, ఎస్.శ్రీనివాసరావు, ఖలీల్, మహమ్మద్ హసన్ షరీఫ్, రెహమాన్, చింతపల్లి శ్రీనివాసరావు, రాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# సంక్రాంతికి ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు

*సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజల రాకపోకల దృష్ట్యా ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు నడుపుతామని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. సంక్రాంతి వచ్చిందంటే ప్రత్యేకంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వేలాది మంది బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖ తదితర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వస్తుంటారని, వీరి సౌకర్యార్థం ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడుపుతుందని తెలిపారు. ఈవారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..*

\- ప్రజాశక్తి, విజయనగరం కోట

- ఈసారి సాధారణ ఛార్జీలతోనే ప్రయాణం
- రెండువైపులా బుక్ చేసుకుంటే రిటన్ టిక్కెట్‌లో 10 శాతం రాయితీ
- సీనియర్ సిటిజన్లకు రెండు వైపులా 25 శాతం..
- 'ప్రజాశక్తి'తో జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి కె.శ్రీనివాసరావు ముఖాముఖి

**? సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎపిఎస్‌ఆర్‌టిసి ద్వారా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?.**

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికులకు ఇతర ప్రాంతాల నుంచి విజయనగరం చేరుకోవడానికి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. విజయనగరం, శృంగవరపుకోట డిపోల నుంచి 14 సూపర్ లగ్జరీ బస్సులను హైదరాబాద్ బిహెచ్‌సిఎల్‌కు నడుపుతాం. 12, 13వ తేదీల్లో విశాఖపట్నం నుంచి 60 ప్రత్యేక బస్సులు 24 గంటల సర్వీసులు అందుబాటులో ఉంటాయి.

**? గతేడాదిలో ఆర్‌టిసి ఆదాయం ఏ విధంగా ఉంది?.**

గత సంవత్సరం ఆర్‌టిసి నష్టాల్లోనే ఉందని చెప్పుకోవాలి. ఎందుకంటే డీజిల్ ఛార్జీలు, వాహనాల విడిభాగాల రేట్లు అధికంగా పెరిగాయి. ఛార్జీలు మాత్రం పెరగలేదు. కానీ, గత 10 నెలల్లో చూసుకుంటే ఒఆర్ రేషియో 67 శాతం నుంచి 69 శాతానికి పెరగడం సంతోషించదగ్గ విషయం.

**? ఆర్‌టిసి అద్దె బస్సులను కరోనా తర్వాత పూర్తిస్థాయిలో తీసుకున్నారా?. హైర్ బస్సుల డ్రైవర్లకు సక్రమంగా వేతనాలిస్తున్నారా?**

ప్రస్తుతం అద్దెబస్సులను పూర్తిస్థాయిలో తీసుకొని నడుపుతున్నాం. ఏ బస్సునూ ఆపలేదు. ప్రస్తుతం జిల్లాలో 49 అద్దె బస్సులు నడుస్తున్నాయి. అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలను బస్సుల యాజమాన్యాలు చూసుకుంటాయి. మాకు సంబంధం లేదు.

**? జిల్లాలోని విజయనగరం, ఎస్.కోట డిపోల్లో కాలం చెల్లిన బస్సులు ఎన్ని ఉన్నాయి ?.**

జిల్లాలోని విజయనగరం, ఎస్.కోట డిపోల్లో కాలం చెల్లిన బస్సులు నాలుగు ఉండేవి. వాటిని కూడా ఆపేసి, రెండు నెలల క్రితం మూడు అద్దె బస్సులు తీసుకున్నాం. కాలం చెల్లిన బస్సులను ఆపివేస్తాం.

**? డిపోల్లో ఆధునికీకరణ చర్యలు ఏమైనా చేపట్టారా?.**

విజయనగరం ఆర్‌టిసి డిపోలో అదనంగా 6 ప్లాట్ ఫారాలు 45 లక్షల రూపాయలతో నిర్మించాం. డిపోలో నాన్ స్టాప్ కౌంటర్, ప్యాసింజర్ ఎంక్వైరీ కౌంటర్ ఆధునీకరించాం. రూ.10 లక్షలతో టాయిలెట్లని ఆధునీకరించాం.

**ప్రయాణికులను ఆకర్షించేందుకు చర్యలు ఏమైనా చేపడుతున్నారా?.**

ఎపిఎస్‌ఆర్‌టిసి వ్యాలెట్ ద్వారా ఎవరైనా టిక్కెట్లు బుక్ చేసుకుంటే ప్రయాణ ఛార్జీలో ఐదు శాతం రాయితీ ఉంటుంది. రెండు వైపులా ప్రయాణం కోసం టిక్కెట్లు బుక్ చేసుకుంటే వారికి రిటర్న్ ప్రయాణ ఛార్జీలో 10 శాతం రాయితీ ఉంటుంది. సీనియర్ సిటిజన్లకు రెండువైపులా 25 శాతం ప్రయాణ ఛార్జీలో రాయితీ ఉంటుంది. గతంలాగా ఈసారి అదనపు ఛార్జీలు ఉండవు. సాధారణ ఛార్జీలతోనే ప్రయాణించడానికి ఆర్‌టిసి అవకాశం కల్పిస్తుంది. ఆర్‌టిసి ద్వారానే ప్రజలకు సౌకర్యంతమైన ప్రయాణం అందుతుంది.

**? ఆర్‌టిసి కార్గో సర్వీసులు ఎలా నడుస్తున్నాయి?.**

కార్గో సర్వీసులు లాభదాయకంగానే నడుస్తున్నాయి. గతం కంటే ఈసారి అదనంగా రూ.70 లక్షల ఆదాయం చేకూరింది.

**? కరోనా ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలేమిటి?.**

ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రత్యేక ఆదేశాలు జారీ కాలేదు. అయితే ప్రయాణికుల ఆరోగ్యం రీత్యా కరోనా నిబంధనలను పాటిస్తున్నాం. అందులో భాగంగానే 'ప్రతి ప్రయాణికుడు మాస్కు తప్పనిసరిగా ధరించాలి, శానిటైజర్ వాడాలి, భౌతిక దూరం పాటించాలి' అంటూ మైక్ ద్వారా డిపోలలో ప్రచారం చేయిస్తున్నాం.

## బ్యాంకులను ప్రయివేటీకరించొద్దు

ప్రజాశక్తి-విజయనగరంకోట

బ్యాంకింగ్ రంగ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తున్నామని ఎఐబిఎ, బ్యాంక్స్ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ జిల్లా అధ్యక్షులు బివి ప్రసాద్, కార్యదర్శి మురళి శ్రీనివాస్ స్పష్టంచేశారు. ఆదివారం స్థానిక అమర్ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉందంటే బ్యాంకులు ప్రభుత్వ రంగంలో ఉండడమే కారణమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పటిష్టంగా ఉన్న బ్యాంకింగ్ రంగాన్ని ప్రయివేటీకరణ పేరుతో నీరుగార్చాలని చూస్తోందని దుయ్యబట్టారు. ఎల్‌ఐసిని ప్రయివేటీపరం చేసే కుట్రలో భాగంగానే వాటాలను ప్రభుత్వం కొంతమేర ఉపసంహరించుకుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ రంగ బ్యాంకులను కూడా కొంతమంది కార్పొరేట్ల కబంద హస్తాలలో పెట్టాలని భావిస్తోందని, ఈ నిర్ణయాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. బడా పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వేల కోట్ల రూపాయలు రుణంగా తీసుకుని ఎగవేతకు పాల్పడ్డారని, వారికి కేంద్రం అండగా నిలుస్తోందని చెప్పారు. అటువంటి వారి నుంచి మొత్తం రుణాన్ని వసూలు చేస్తే ఏ ప్రభుత్వ రంగ బ్యాంకూ నష్టాల్లో ఉండదన్నారు. అవుట్ సోర్సింగ్ వ్యవస్థతో బ్యాంకుల్లో ఉద్యోగ నియామకాలు నిలిచిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బి.అశోక్, బ్యాంక్ ఎంప్లాయీస్ శ్రావణ్ కుమార్, రవికుమార్, శ్రీనివాస్ శర్మ, బానోజీరావు, మనోజ్‌కుమార్, వెంకటాచలం, నాగభూషణం, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## అంధుల అక్షర ప్రదాత బ్రెయిలీ

### జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ హోంలో సారథి వెల్ఫేర్ అసోసియేషన్, దృష్టిలోప ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సారథి వెల్ఫేర్ అసోసియేషన్ అంధులకు అండగా ఉండడం ఎంతైనా అభినందనీయమన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మీసేవా కేంద్రాన్ని వికలాంగుల వసతి కోసం తక్కువ రుసుంతో కేటాయిస్తున్నట్లు చెప్పారు. వసతిగృహం కోసం అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆ శాఖ ఎడిని ఆదేశించారు. వసతిగృహానికి నెలవారీ రుసుమును తాను అందజేస్తానని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రకటించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కేలండర్‌ను ఆవిష్కరించారు. సేల్స్ టాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జి.రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి జివిబి జగదీష్, సత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.శశి భూషణరావు, హెల్పింగ్ హ్యాండ్స్, హిజ్రాల అసోసియేషన్ వ్యవస్థాపకులు దవడ కొండబాబు, సారథి వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ప్రదీప్ కుమార్ , ఎల్.రత్నరాజు పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

## విద్యార్థి దశే భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థి దశే బంగారు భవిష్యత్తుకు పునాదని, సరైన మార్గంలో వెళ్తేనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని వన్‌టౌన్ సిఐ వెంకటరావు తెలిపారు. ఆదివారం తోటపాలెంలోని సత్య డిగ్రీ, పిజి కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యసనాల బారిన పడితే అనేక సమస్యల్లో ఇరుక్కొంటారని చెప్పారు. టెక్నాలజీని దుర్వినియోగం చేస్తున్నారని, తల్లిదండ్రుల మాటను ఖాతరు చేయడం లేదని తెలిపారు. ఇలా చేయడం వల్ల నేటి యువత సాధించేది ఏమీ లేదన్నారు. ఎంతో మంది విద్యార్థులు చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అనేక విషయాలపై మాట్లాడించారు. చక్కగా మాట్లాడిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.సాయి దేవమణి, ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్యవేణి పాల్గొన్నారు.

**బ్యాగులు పంపిణీ**

సత్య డిగ్రీ, పిజి కళాశాలలో సారథి వెల్ఫేర్ అసోసియేషన్, అంధ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని అంధ విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. రూ.1.20 లక్షల విలువైన బ్యాగులను సత్య విద్యాసంస్థలు, ధీర ఫౌండేషన్ అందజేశాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపల్ ఎం.వి. సాయి దేవ మణి పాల్గొన్నారు.

## వైభవంగా నవనీత సేవ

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం నవనీత సేవ అంగరంగ వైభవంగా జరిగింది. మూల విరాట్ విగ్రహాన్ని వెన్నతో అలంకరించి ఆలయాన్ని పలు రకాల పువ్వులతో అలంకరించారు. నవనీత సేవను ఆలయ ధర్మకర్తలు సుజయకృష్ణ రంగారావు, బేబినాయన ప్రారంభించారు. సాయంత్రం కేంద్ర మాజీ మంత్రి అశోక్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నవనీత సేవ సందర్భంగా భక్తి పాటల కచేరి ఏర్పాటు చేశారు. ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది.

ఆలయంలో పూజలు చేస్తున్న టిడిపి నేతలు అశోక్, బేబినాయన

రోగితో మాట్లాడుతున్న వైద్యులు మధుబాల

## బొద్దాంలో ఉచిత వైద్య శిబిరం

**వేపాడ** : మండలంలోని బొద్దాం గ్రామం సచివాలయ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్‌కోటకు చెందిన సంజీవిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. బాలాజీ రావు, మధుబాల పాల్గొన్నారు.

## క్రీడలు జీవితంలో భాగం

**విజయనగరంటౌన్ :** క్రీడలు జీవితంలో భాగమని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి కోరారు. ఆదివారం నగరంలో ఇన్‌స్పైర్ స్కూల్ ఆవరణలో విన్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోచ్‌లు, క్రీడాకారుల శిక్షణ ముగింపు సభలో ఆమె మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను సత్కరించారు.

అవార్డులు సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

## జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక

**వేపాడ** : మండలంలోని బికె. నాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాలలో 9వ తరగతికి చెందిన బొత్స సింహాచలం, కొత్తూరు స్నేహ, ఎర్రంశెట్టి మానస జిల్లా స్థాయిలో ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికయ్యారు. మోటరింగ్ సిస్టం యూజింగ్ ఐఒటి(సిస్టం), డ్యూయల్ పర్పస్ టిస్యూ పేపర్ ఫ్రొం అలోవెరా ప్లాంట్, ఎమర్జెన్సీ రిసీవ్ సిస్టం ప్రాజెక్టులకు గాను వీరిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఆదివారం అభినందించారు.

ఆడారి తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్వేశ్వరరావు, రైతులు

## తులసీరావుకు ఘన నివాళి

**శృంగవరపుకోట :** ఆడారి తులసిరావు మరణం ఉత్తరాంధ్ర పాల రైతులకు తీరని లోటని శ్రీ గౌరీ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల విశ్వేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని భవాని నగర్ గ్రామంలో శ్రీ గౌరీ సేవా సంఘం గవరపాలెం, భర్తపురం, భవాని నగర్, గౌరీపురం ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డైరీ అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. చాలామంది పాడి రైతు కుటుంబాలకు విద్యా ఆరోగ్య సౌకర్యాలను కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘ అధ్యక్షులు వెంకటరమణ, కార్యదర్శి పెంటకోట తాతనాయుడు, కార్యవర్గ సభ్యులు పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పార్కులో పర్యాటకుల సందడి

**సీతంపేట :** స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు రోజు కావడం, అందులో నూతన సంవత్సరం కావడంతో జిల్లా నలుమూల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేశారు. జలవిహార్ వద్ద బోటుషికార్లు చేశారు. అనంతరం మెట్టగూడ జలపాతాన్ని సందర్శించారు.

## ఐద్వా జెండావిష్కరణ

**సాలూరు:** సమానత్వమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు టి.ఇందు, నాగమణి కోరారు. ఆదివారం స్థానిక ఐద్వా కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేరళలోని తిరువనంతపురంలో 13వ ఐద్వా జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యం ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

## లలిత కుటుంబ సభ్యులకు పరామర్శ

**కురుపాం :** మండలంలోని వలసబల్లేరుకు చెందిన పాలక లలిత (34) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ సంఘటన తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా వైసీపీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, మాజీ ఎంపిపి ఇందిరకుమారి, మొండెంఖల్ ఎంపిటిసి సభ్యులు జి.విద్యారాణి, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భోగిమంటలు వేస్తున్న కాలనీ వాసులు

## ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

**విజయనగరం టౌన్ :** శ్రీసాయి దుర్గ ఉమామహేశ్వరి నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగాయి. పిల్లలకు గాలి పటాలు ఎగురవేయడం, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముందుగా భోగి మంటలు వేశారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు సుధా కృష్ణ మాట్లాడుతూ కాలనీలో ప్రజలంతా ఐకమత్యంగా ఉంటూ సంబరాల్లో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సువర్ణరాజు, ఎల్.మోహనరావు, తాడి ప్రసాద్, సూర్యప్రకాష్, రామరాజు, బిఎస్ఎన్ రాజు, లక్ష్మణరావు, టి.సూర్యారావు, పాల్గొన్నారు.

# వైసిపి కర్మను వదిలించుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్రానికి పట్టిన వైసిపి కర్మను వదిలించు కోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం నగర పంచాయతి పరిధి జరజాపుపేట 19వ, వార్డులో టిడిపి ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వార్డులో పర్యటించి పింఛన్లు, సంక్షేమ పథకాలు అమలుపై అడిగి తెలుసుకున్నారు. దీంతో కొంత మంది ప్రజలు మాట్లాడుతూ తమకు వస్తున్న పింఛన్లు, సంక్షేమ పథకాలకు సాకుల చూపించి అన్యాయంగా తీసివేశారని వాపోయారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ అధికార వైసిపి పథకాలు అమలు చేతకాక కుంటి సాకులతో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు, పింఛన్లు నిలిపివేస్తుందన్నారు. పింఛన్లు పెంపుదల చేస్తున్నామని చెప్పి ఉన్న పింఛన్లు తొలగించడం సమంజసం కాదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి జాడ లేదని, పథకాలు పేరిట మభ్య పెడుతన్నారని విమర్శించారు. ప్రతిపక్షాలను అణగ దొక్కడానికి చీకటి జీవో 1తీసుకు రావడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, పతివాడ తమ్ము నాయుడు, పోతల రాజప్పన్న, లెంక అప్పల నాయుడు, బైరెడ్డి లీలావతి, అవనాపు సత్య నారాయణ, కాళ్ళ రాజ శేఖర్, కింతాడ కళావతి, నరవ రామలక్ష్మీ, కాళ్ళ సత్యవతి, మద్దిల శ్రీను పాల్గొన్నారు.

జరజాపుపేటలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

## తాగునీటి సరఫరాకు అంతరాయం

**పాలకొండ :** పట్టణంలోని వెంకంపేట వాటార్ ట్యాంక్‌కు నగర పంచాయతీ ద్వారా అందించే తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనందని కమిషనర్ సర్వేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంకిలిలో గల పంపింగ్ పైప్ లైన్ మరమ్మతులకు గురైనందున ఆ ట్యాంక్ పరిధిలో గల 1, 2,10,11,12,18,19,20 వార్డులకు ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం వరకు నీటి సరఫరా రాదని పేర్కొన్నారు. ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతున్నాయని, మరమ్మతులు అనంతరం నీటిసరఫరా ఇవ్వగలమని, ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా కమిషనర్ పట్టణవాసులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం తరవాత ఎదావిధిగా నీటి సరఫరా జరుగుతుందని చెప్పారు.

# వృద్ధులకు నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని తుమ్మికపల్లి గ్రామానికి చెందిన ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ్ హరికుమార్ ఆధ్వర్యంలో 35 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ సత్య సాయి ట్రస్ట్ సభ్యులు మంచాల రామ్మూర్తి, సి.ఎస్.ఆర్ గవర్నమెంట్ ఏలియన్స్, పైడంనాయుడు యాక్టివ్ రీజినల్ వాలంటీర్, శ్రీ విజయలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రైటర్ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ ఫర్ ద పీపుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు నిస్వార్థంగా ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో ఫర్ ద పీపుల్ ట్రస్ట్‌కి చేదోడు వాదోడుగా ఉంటామని తమ సత్య సాయి ట్రస్ట్ తరపున సేవా కార్యక్రమాలు మరింత ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ్ హరికుమార్ మాట్లాడుతూ ముందుగా దాతలకు ధన్యావాదాలు తెలిపారు. అనంతరం శ్రీసత్య సాయి ట్రస్ట్ సౌజన్యంతో 35 మంది వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, ట్రెజరర్ విశ్వనాథ శ్రావణ్ కుమార్, ట్రస్ట్ సభ్యులు విశ్వనాథ్ గోవిందరావు, గణేష్, నగేష్, ఈశ్వర్, ధర్మ, తదితర సభ్యులు పాల్గొన్నారు.

బొబ్బిలి: దుప్పట్లను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

**పూసపాటిరేగ :** మండలంలోని గోవిందపురం సర్పంచ్ బాలా రామలక్ష్మి, ఉప సర్పంచ్ బాలా అప్పలరాజు పంచాయతీలోని సుమారుగా 500 మందికి సంక్రాంతి సందర్భంగా బట్టలు పంపిణీ చేశారు. ఒక్కొరికి పంచా, తువ్వాలి, చీర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబం సంక్రాంతి సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ పంపిణీ ఏటా చేస్తున్నామన్నారు. సంక్రాంతి సమయంలో తమతో పాటు మిగిలిన వారంతా సంతోషంగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే బట్టలు పంపిణీ చేశామన్నారు.

### పేదలకు దుప్పట్లు పంపిణీ

**బొబ్బిలి :** పాతబొబ్బిలి బస్టాప్ వద్ద ఉన్న దయగలగోడ వద్ద వీరబొబ్బిలి మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా అధ్యక్షులు రెడ్డి దామోదర్ ఆధ్వర్యంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.అప్పారావు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దయగల గోడ సేవలను కొనియాడారు. దయగల గోడ నిర్వాహకులు ఎం.విజయమోహన్, పుప్పాల సురేష్‌ను మాజీ సైనిక ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రమేష్ నాయుడు, రాష్ట్ర మాజీ సైనికుల హక్కుల సమితి జాయింట్ సెక్రటరీ రెడ్డి అప్పలనాయుడు, కోశాధికారి బి.ఈశ్వరరావు, మాజీ అధ్యక్షులు సబ్బన సతీష్ కుమార్, డాక్టర్ చైతన్య, ఎం.ఎల్ రావు , రెడ్డి రామకృష్ణ, వైవి రావు, గెంబలి శ్రీను, జి.రమేష్, పూడి సింహాచలం, వేమల రమేష్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

## యువశక్తి సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఈనెల 12న నిర్వహించనున్న యువశక్తి సభ విజయవంతం చేయాలని యువశక్తి సభ ప్రచారకర్త ముమ్మిడివరం నియోజకవర్గం ఇంచార్జి పితాని బాలకృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని యువశక్తి సభ సన్నద్ధ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది నాయకులు స్వలాభమే ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి కారణమన్నారు. ఇక్కడ యువత అధికంగా ఉన్నా వారిని పట్టించుకునే నాధుడే కరువయ్యాడన్నారు. లక్షలు ఉద్యోగాలంటూ యువతిని మోసం చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్దే అధినేత పవన్‌కళ్యాణ్ ధ్యేయమన్నారు. లోకం మాదవి మాట్లాడుతూ యువత పవరేంటో ఈ ప్రాంతామంతా తెలిసేలా సభకు యువతను తరలించాలన్నారు. సమావేశంలో లోకం ప్రసాద్, ఉత్తరాంధ్ర రీజనల్ కమిటీ మెంబర్ తుమ్మి లక్ష్మీరాజ్, మండల నాయకులు శివ, బూర్లె విజయశంకర్, అప్పలరాజు, జానకీరామ్, పతివాడ అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడతున్న మాధవి లోకం

**నెల్లిమర్ల:** నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో జనసేన మండల అధ్యక్షుల పతివాడ అచ్చంనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి యువశక్తి పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా జనసేన నాయకుల పితాని బాలకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 12న జరగనున్న సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకం మాదవి, మొయిద లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

సంక్రాంతి పండగకు దూర ప్రాంతాల నుండి జిల్లాకు వచ్చేవారికి సాధారణ చార్జీలతో ఆర్‌టిసి ప్రత్యేక అల్ట్రా డీలక్స్ నడుపుతున్నట్లు ఎస్‌కోట డిపో మేనేజర్ కె. రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్ కోట డిపో నుండి విశాఖ మీదుగా హైదరాబాద్, హైదరాబాదు నుండి విశాఖ, విజయనగరానికి ఆల్ట్రా డీలక్స్ బస్సులు ఈనెల 11, 12, 13, తేదీలలో సాధారణ చార్జీలతో నడుపుతున్నామన్నారు. విశాఖపట్నం నుంచి ఎస్‌కోట, అరుకు వైపు వచ్చే ప్రయాణికుల కోసం కొన్ని స్పెషల్ సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. పండగ తర్వాత 16, 17 తేదీలలో బస్సులను మళ్లీ హైదరాబాద్‌కు నడుపుతామని డిమాండ్‌ను బట్టి మరో రెండు రోజులు పొడిగించే అవకాశం ఉందని ఆయన అన్నారు. పండుగ రోజులలో అప్ అండ్ డౌన్ టిక్కెట్లు ఒకేసారి ఆన్‌లైన్‌లో తీసుకున్న ప్రయాణికులకు 10 శాతం రాయితీ కల్పిస్తామన్నారు. సీనియర్ సిటిజనులకు టికెట్ చార్జీలో 25శాతం రాయితీ ఉంటుందన్నారు. ప్రయాణికులు ఈ స్పెషల్ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఉపాధి పనులపై గ్రామసభ

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని బైరిపురం గ్రామంలో 2020-21, 2021-22 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులుపై డిఆర్‌పి సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పేదరికాన్ని నిర్మూలించటానికి, వలసలు నివారించటానికి, సుస్థిర ఆస్తులు అభివృద్ధికి ఉపాధి హామీ పనుల ఉపయోగపడతాయన్నారు. అనంతరం రెండు సంవత్సరాలలో గ్రామంలో జరిగిన ఉపాధి పనులు, ఏవిన్యూ ప్లానిటేషన్, బ్లాక్ ప్లానిటేషన్, ఆర్టికల్చర్, న్యూ చెక్ డామ్స్, బిటి రోడ్స్, గ్రామ సచివాలయాలు పనులకు సంబంధించి తనిఖీ చేశామన్నారు. వాటి ఖర్చుల వివరాలుకు సంబంధించిన వాటిని కూడా పరిశీలించామన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ పప్పల విజయ కుమారి, ఉపసర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, గ్రామ పెద్దలు పప్పల గ్రహణేశ్వరరావు, కందుల మళ్ళి ఖార్జునరావు, వేతన ధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సభలో మాట్లాడతున్న డిఆర్‌పి సూర్యప్రకాష్

## నిమ్మలపాలెంలో గడపగడపకు..

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని నిమ్మలపాలెంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ బొంతుల వెంకటరావు, పిఎస్ఎన్ పాత్రుడు, స్థానిక సర్పంచ్ కొట్యాడ నిర్మల సాయి, కొట్యాడ శ్రీనివాసరావు, అప్పన్నపాలేం సర్పంచ్ కోన దేవుడు, ఎంపిటిసి మునూరు శివప్రసాద్, సర్పంచులు, ఎంపిటిసిల పాల్గొన్నారు.


బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

## 108 సేవలపై అవగాహన

ప్రజాశక్తి - వంగర

అత్యవసర సమయాల్లో 108 సేవలను వినియోగించు కోవాలని ఈఎమ్‌టి లు విశ్వనాథం, అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని తలగాంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీలు ప్రసవ సమయంలో 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 108 పైలెట్లు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

## రోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని నిమ్మలపాలెం గ్రామానికి చెందిన జాయినింగ్ హ్యాండ్ వెల్ఫేర్ సొసైటీ నేతృత్వంలో అదే గ్రామానికి చెందిన పొలిపర్తి అక్కునాయుడుకి ఆర్థిక సాయం అందించారు. అక్కునాయుడు బ్రెయిన్‌కి సంబంధించిన సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకుని వారికి రూ. 12వేలు అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు గొంప రాంబాబు మాట్లాడుతూ ఈ ట్రస్టు ద్వారా గడిచిన రెండేళ్లలో ఎన్నో పేద కుటుంబాలకు, అనాధ వృద్ధులకు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి తమ సొసైటీ వంతు సాయంగా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గొంప శ్రీ రాములు నాయుడు, గొంప శ్రీను, సిరిమల్ల పైడి రాజు, చీపురుపల్లి సాగర్ కళ్యాణ్, గొంప కొండలరావు, గొంప త్రినాధ్, భూమిరెడ్డి నాయుడు, గొంపలక్ష్మి, బొబ్బర రమణ, బొబ్బర మధు కిరణ్ పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక సాయం అందిస్తున్న సొసైటీ సభ్యులు

## ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

**వేపాడ** : ఏప్రిల్ 5న పార్లమెంటు ముందు ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ఉన్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక, మతోన్మాద, నియంత్రత్వ బిజెపి విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రాల హక్కులను హరించే విధానాలకు వ్యతిరేకంగా, హక్కుల సాధనకై చలో పార్లమెంట్ నిర్వహిస్తు న్నట్టు తెలిపారు. ఈ చలో ఢిల్లీ జయప్రదం చేయడానికి ముందుగా రాష్ట్రంలో ఈ నెల 9న అన్ని ప్రజా సంఘాలతో విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అధికారులను, ప్రజా ప్రతినిధులను, లొంగ తీసుకునే చర్యలను విడనాడాలన్న డిమాండ్లతో ఆల్ ఇండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో పార్లమెంటు ముందుకు చలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

## స్తంభించిన మురుగునీరు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కాలువలో బండరాళ్లు ఇలా అయితే కాలువలో మురుగునీరు వెళ్లేది ఎలా అని పట్టణంలోని 26వ వార్డులో గల పండా వీధివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.63 కోట్ల 63 లక్షలతో ఎఐఐబి సహకారంతో పట్టణంలోని అన్ని వార్డుల్లో సమగ్ర తాగునీరు పథకం ద్వారా పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. సంబంధిత కాంట్రాక్టర్ కొన్ని రోజులుగా చేపడుతున్న ఈ పనుల్లో భాగంగా పైప్ లైన్లు వేసేందుకు పండా వీధిలో గల సిసి రోడ్డును జెసిబితో తవ్వి పైపులు వేసి గోతులను కప్పే క్రమంలో పెద్ద పెద్ద బండ రాళ్లు మురుగు కాలువలో పడ్డాయి. వీటిని తొలగించకపోవడంతో మురుగునీరు వెళ్ళేందుకు అవకాశం లేకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పండగ రోజులు కావస్తుండడంతో నివాస గృహాల్లో వాడుక నీరు ఎక్కువయ్యే అవకాశం ఉందని, దీనివల్ల వారికి నీరు రహదారిపై వచ్చే అవకాశం ఉందని, యుద్ధ ప్రాతిపదికన సంబంధిత కాంట్రాక్టర్ గానీ, మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు గానీ స్పందించి ఈ రాళ్లను తొలగించి మురుగునీరు వెళ్లేందుకు మార్గం సుగమం చేయాలని ఆ వీధి స్థానికులు కోరుతున్నారు.

## వైసిపితో ఎస్‌సిలకు ఒరిగేదేమీ లేదు

**వేపాడ** : వైసిపితో ఎస్‌సిలకు ఒరిగేదేమీ లేదని మండల దళిత మహాసభ అధ్యక్షుడు కొమనాపల్లి రాము అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రభత్వంలో కనీసం ఎస్‌సిలకు రుణాల కూడా రావడం లేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి సిఎం బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి మతాలు, కులాల పేరిట చిచ్చుల పెట్టడమే తప్ప అభివృద్ధి చేయడం లేదన్నారు. జిల్లా షెడ్యూల్ సంక్షేమ సంఘం ద్వారా గ్రామ సభలు ఏర్పాటు చేసి అర్హులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు.

## తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని తిప్పలవలస సముద్రం తీరానికి ఆదివారం మృతదేహం కొట్టుకొచ్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహన్ని పరిశీలించగా ఆయన దగ్గర ఉన్న కార్డులు ప్రకారం చీపురపల్లి మండలం కాసా శ్రీనివాసరావు (27) గా గుర్తించారు. విషయాన్ని కుటుంబీకులుకు తెలియజేశారు. ఉద్యోగం లేదన్న బాధతో నాలుగు రోజులు క్రితం ఇంటి నుండి వచ్చేసాడని కుటుంబ సభ్యులు చెబుతన్నారు. శ్రీనివాసరావు కనిపించకపోవడంతో చీపురపల్లి పోలీసుస్టేషన్‌లో శనివారం మిసింగ్ కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. అయితే ఆదివారం ఉదయం మృతదేహంగా సముద్రంలో బయటపడ్డాడని చెబుతున్నారు. పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రానున్న ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పండి : శత్రుచర్ల

**జియ్యమ్మవలస :** ప్రజా వ్యతిరేక విధానాలు చేపడుతున్న వైసిపి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని టిడిపి సీనియర్ నాయకులు శత్రుచర్ల విజయరామరాజు పిలుపునిచ్చారు. మండలంలోని తురక నాయుడువలసలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయరామరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదల నడ్డి విరిచిందన్నారు. నిత్యవసర వస్తువులు కరెంట్ చార్జీలు, గ్యాస్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచి పేదలకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. రాబోవు ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలుపొందడానికి ఇప్పటి నుంచే అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జగదీశ్వరి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. సకాలంలో రైతు పండించిన ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వారు తీవ్ర నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి దొంకాడ రామకృష్ణ, మండల అధ్యక్షులు పళ్ళ రాంబాబు, మాజీ వైస్ ఎంపిపి లంక గోపాలం, నాయకులు శ్రీరామ్మూర్తినాయుడు, కృష్ణబాబు, సత్యం నాయుడు తురక నాయుడువలస సర్పంచ్ పి సునీత, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు

**పార్వతీపురం రూరల్:** పేదల పింఛన్ల తొలగింపు వంటి చర్యలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల నుంచి ముఖ్యమంత్రి జగన్‌పై తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. మండలంలోని జమ్మిడివలస పంచాయతీ వీరభద్రపురంలో ఆదివారం నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ప్రజల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.250 పింఛన్ పెంచుతూ రాష్ట్రంలో రెండు లక్షల 50 వేల మంది పింఛన్లు తొలగించి పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. తమ హయాంలో అన్ని వర్గాలకు సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తోఫాలను అందించామని, ఇప్పుడు కనీసం కందిపప్పు, పంచదారకే దిక్కులేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. జగనన్న ప్రభుత్వం పెన్షన్ ఏరివేత కానుకగా ఇచ్చినందుకు అవ్వా, తాతలు మండిపడుతున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, మహం దాత నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**భామిని :** కళ్లాల్లో కదలని ధాన్యంతో దయనీయంగా రైతుల పరిస్థితి ఏర్పడిందని ఇదేమి ఖర్మ రైతాంగానికి అంటూ టిడిపి నాయకులు పడాల భూదేవి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఆదివారం పెద్దదిమిలిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతుల కల్లాల్లో ధాన్యం నిల్వలను చూసి ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదంతా కష్టించి పండించిన పంటకు ఇంత హీనమా అంటూ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వ నిభందనలు రైతుల కాళ్లకు బంధాలుగా మారాయన్నారు. సంక్రాంతి వేళ రైతులు ఉసూరుమంటే ఆ ఉసురు పాలకులకు తగులుతోందని దుయ్యబట్టారు. ఏదిఏమైనా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిన అవసరముందని అన్నారు. నాణ్యతా ప్రమాణాల షాకు, ట్రక్ సీటు జనరేటు చేయకపోవడం, గోనెసంచులు, రవాణా వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు.